

హైదరాబాద్ వార్త



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో సహాయక చర్యల్లో పోలీసులు

# వర్షం ఆగదు.. నీళ్లు కదలవు

- పొంగిపొర్లుతున్న నాలాలు
- జలదిగ్బంధంలో పలు కాలనీలు
- జలాశయాల్లో నీటి మట్టం అలర్ట్

**దుండిగల్.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం పలు కాలనీలు జలమయం అయ్యాయి. ప్రధానంగా మల్లంపేట్ ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో ఉన్న కాలనీలలో వరద ముంచెత్తడంతో ప్రజలకు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న దుండిగల్ సీఐ రామకృష్ణ తన సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సహాయక చర్యల్లో ఎస్సైలు శ్రీనివాస్, ధనుంజయ్, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.**










హైదరాబాద్, జులై 21 ప్రభాతవార్త : ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. వరుసగా నాలుగు రోజుల నుంచి నగరంలో కురుస్తున్న భారీ వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. వరద ఉధృతికి మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడంతో మూతలు పైకి తేలాయి. జనం రోడ్లపై నడవ లేని పరిస్థితి తలెత్తింది. భారీ వర్షానికి గాజులరామారం పెద్ద చెరువు పొంగిపొర్లింది. దాంతో వరద నీరు జనావాసాల్లోకి చొచ్చుకొచ్చింది. ఈ క్రమంలో ఎగువి నుంచి నీటి ప్రవాహం వస్తుండటంతో నిన్నటి నుంచి గాజులరామారంలోని వీనస్‌కాలనీ, ఒక్షిత్ ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాలు వరదనీటిలోనే మగ్గుతున్నాయి. మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం అత్యావసరమైన పాలు, కూరగాయలు తెచ్చుకుంటామన్నా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. హుస్సేన్‌సాగర్ నీటిమట్టం గరిష్టస్థాయికి చేరడంతో పరి సర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుండిగల్ మున్సి పాలి టీలోని బహదూర్‌పల్లిలో ప్రధాన రహదారులు, కాలనీ రోడ్లు నదులుగా మారాయి. రామంతాపూర్, ఉప్పల్, చిలుకానగర్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ, పోచారం, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి ఉప్పల్ కూడలి వద్ద భారీగా వర్షం నీరు చేరడంతో రాకపోలకు ఇబ్బందిగా మారింది. లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోని వరద నీరు వచ్చి చేరింది. కూకట్‌పల్లి ఐడిఎల్ చెరువుకు వరద నీరు చేరడంతో పుంతలు, తొక్కుతుంది. రసాయనాలు కలుషితాల వల్ల నీటిపై నురగ చేరి తెల్లని పాలపుంతను తలపిస్తోంది. భారీగా గాలి వీస్తుండడంతో జాతీయ రహదారిపైకి నురగ విస్తరిస్తుంది. సరూర్‌నగర్ చెరువులోకి ఎగువ ప్రాంతం ఉంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సరూర్‌నగర్ చెరువలో గేట్లు ఎత్తివేతకు అధికారులు సిద్ధమయ్యారు. అంతకు ముందు గేట్ల వద్ద ఉన్న చెత్తను జిహెచ్‌ఎంసి సిబ్బంది తొలగించే పనిలో పడ్డారు. గేట్లు ఎత్తివేసిన తర్వాత పైపులలో వరద నీరు వెళ్ళేటప్పుడు చెత్త అడ్డంకిగా లేకుండా సిబ్బంది తొలగించింది. జంట జలాశయాలతో పాటుగా హుస్సేన్‌సాగర్‌లో కూడా భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటి మట్టం పెరుగుతోంది.

# కంకర తేలి.. మట్టి పేరుకుపోయి



వర్షాలు వస్తున్నాయంటే నీరు నిలిచి రోడ్లు పాడవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నా.. శాస్త్రీయ విధానంలో రోడ్లు నిర్మించక పోవడమే వరద నీరు నిలిచేందుకు ప్రధాన కారణమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రమాణాల ప్రకారం రోడ్డు మధ్యలో ఎత్తుగా ఉండి, పక్కలకు ఏటవాలుగా ఉండాలి. కానీ కార్పెటింగ్, రీ కార్పెటింగ్ ప్యాచ్ వర్క్‌ల పేరిట ఇష్టానికి బీటీ మిక్సింగ్ వేయడంతో చాలా ప్రాంతాల్లో ఎగుడు దిగుడుగా రహదారులు కనిపిస్తాయి. దీంతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు ఉన్న వాటిలోకి వర్షపు నీరు వెళ్లే పరిస్థితి చాలా ప్రాంతాల్లో లేదు. రోడ్ ప్రొఫైల్ సరిగా లేకపోవడమూ రోడ్డు పాడవడానికి కారణమన్నది నిపుణుల అభిప్రాయం.

**ప్రధాన రహదారులపైనా భారీ గుంతలు**

**అంతర్గత రహదారులు మరీ అధ్వాన్నం**

**పూర్తిగా పాడైపోయిన వరంగల్ జాతీయ రహదారి**

**ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ,అంబర్‌పేట**

**ఐదేళ్లలో రూ.2,200 కోట్లకు పైగా ఖర్చు**

**మరమ్మతుల పేరుతో రూ.కోట్లలో వ్యయం**

**అయినా మారని దుస్థితి**

**ప్రమాదాలకు, అనారోగ్యాలకు గురవుతున్న వాహనదారులు**



ఖైరతాబాద్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

హైదరాబాద్, జులై 21 ప్రభాతవార్త : భారీ వర్షాలకు మహా నగర రహదారులు ఎప్పటిలాగే ఛిద్రమయ్యాయి. వందల కోట్లు ఖర్చు పెట్టినా పరిస్థితిలో మార్పు కాలేదు. గ్రేటర్‌లో 9,103 కి.మీల రహదారులున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చాలా రోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టుమని పది మీటర్లు కూడా కుదుపులేని ప్రయాణం నగర రోడ్లపై సాగే పరిస్థితి లేదు. ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోన్న ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లో రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ మార్గంలో వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. కర్మన్‌ఘాట్, చంపాపేట, చాంద్రాయణగుట్టల మీదుగా శంషాబాద్‌కు వెళ్లే వారికీ అదే దురవస్థ, చేరుకోవాల్సిన గమ్యస్థానానికి వెళ్లేందుకు పాడైన రహదారుల వల్ల సమయ బారం పడుతోంది. ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్పల్, బోడుప్పల్,మేడిపల్లి మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక నల్లచెరువు రోడ్డు పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ఈ జాతీయ రహదారిలో ఎలివేటెడ్ బ్రిడ్జి పనులు దాదాపు నిలిచిపోగా.. ఈ మార్గంలోని రోడ్లనైతే పట్టించుకునే వారు లేకుండా పోయారని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిహెచ్‌ఎంసి అధికార లెక్కల ప్రకారం రహదారుల నిర్మాణం, నిర్వహణ (వంతెనలు, అండర్‌పాస్‌లు కాకుండా)కు కోట్లు కుమ్మరిస్తున్నా మహానగరంలో రహదారుల పరిస్థితి మెరుగుపడడం లేదు. ప్రైవేటుకు అప్పగించిన రోడ్ల నిర్వహణలోనూ నాణ్యత కొరవడింది. ఐదేళ్లలో రహదారుల నిర్మాణం, నిర్వహణకు రూ.2,250 కోట్లు ఖర్చయినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2018 ఎన్నికల ముందు రహదారుల వ్యవస్థ మెరుగుపర్చేందుకు పీరియాడిక్ ప్రివెంటివ్ మెయింటెనెన్స్ (పిపిఎం) చేపట్టారు. రూ.721 కోట్లతో జిహెచ్‌ఎంసి, మరో రూ.350 కోట్లతో హెచ్‌ఆర్‌డిసిఎల్ ముందస్తు రహదారుల నిర్మాణ పనులు చేయాలని నిర్ణయించాయి. ఇందులో సుమారు రూ.800 కోట్లకుపైగా ఖర్చు చేశారు. అయినా పరిస్థితి ఏమార్పు కనిపించడంలేదు. రోడ్ల నిర్మాణం మాత్రమే కాదు. గుంతల పూడ్చివేతకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఏటా గుంతల మరమ్మతుకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పైగా వెచ్చిస్తున్నారు.

నగరం బురదమయంగా మారి విశ్వనగరంగా తీర్చిదిద్దే హైదరాబాద్‌లోనే ఉన్నామా? అన్న అనుమానం కలగిస్తోంది. ఐదు నెలల క్రితం నిర్మించిన రహదారులపై కూడా పలు ప్రాంతాల్లో గుంతలు పడి, కంకర తేలాయి. లోయర్ ట్యాంక్‌బండ్‌తో పాటు శివారు ప్రాంత ఫిర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లలో కంకరతేలి మోకాల్లోతున గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్‌మండి, చిలకలగూడ, రాంనగర్, రాజేంద్రనగర్, అంబర్‌పేట,నాచారం, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. ఉప్పల్ నల్లచెరువు నుండి అంబర్‌పేట వరకు ఏర్పడిన గుంతలను పూర్చడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలత్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.నగర శివారు ప్రాంతాలు నిజాంపేట, దుండిగల్, మణికొండ మున్సిపాలిటీల ప్రాంత రహదారుల్లో పరిస్థితి మరీ ఆధ్వాన్నంగా మారింది. తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పునరుద్దరించలేదు.

# సెంటిమెంట్ కొనసాగించిన కిషన్‌రెడ్డి

**భాగ్యలక్ష్మీ అమ్మవారి దర్శనం.. మహనీయులకు నివాళులు**

**నాల్గోసారి తెలంగాణ బిజెపి అధ్యక్ష బాధ్యతలు**



పాతబస్తీ భాగ్యలక్ష్మీ టెంపుల్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్ గౌతంరావు తదితరులు

హైదరాబాద్, జులై 21 ప్రభాతవార్త : నాల్గోసారి తెలంగాణ బిజెపి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ టెంపుల్ సెంటిమెంట్‌ని కొనసాగించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసే ముందుగా శుక్రవారం ఉదయం అమ్మవారిని దర్శించుకొని తన పని మొదలుపెట్టారు. అనంతరం బషీర్‌బాగ్‌లోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత అంబర్‌పేట చేరుకుని మహాత్మా జ్యోతిరావుపూలే, లిబర్టీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎల్‌బిస్టేడియం ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి, గన్‌పార్కు వద్ద నున్న తెలంగాణ అమర వీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కిషన్‌రెడ్డి వెంట ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు తదితరులు ఉన్నారు. కిషన్‌రెడ్డి ఉదయం 11.45 గంటలకు నాంపల్లిలోని బిజెపి కార్యాలయానికి చేరుకుని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.



మణికొండ మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

# లిఫ్ట్ ఇచ్చి కారులో మహిళపై లైంగికదాడి

హైదరాబాద్, జులై 21 ప్రభాతవార్త : ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. మహిళలు కనిపిస్తే చాలు మాటలు కలిపి మంచితనం నటించి వారిపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. ఎదుటివారిది నటన అని గ్రహించని మహిళలు, అమ్మాయిలు వారిని నమ్మి కామాంధుల చేతిలో నలిగిపోతున్నారు.వారితో ప్రయాణించే సమయంలో మగాళ్లతో వెళితే మృగాళ్లామారుతారని ఊహించలేక..వారి అకృత్యాలకు బలవుతున్నారు. వారి బలహీనతే మగాళ్లకు అకవాశంగా మారుతోంది. మహిళల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని వారిని బెదిరించి లోబరుచుకుంటున్నారు. గుడ్డిగా నమ్మడం వలన వారి జీవితాలు నాశనం అవుతున్నాయి. ఇలాంటి ఘటనే నగరంలో చోటుచేసుకుంది. మధురానగర్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. వర్షంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళకు ఓ కారు డ్రైవర్ లిఫ్ట్ ఇస్తానని ఆపాడు. దానికి ఆమె వద్దంటూ ముందుకు నడుచుకుంటూ వెళుతున్న కారు డ్రైవర్ వర్షం ఎక్కువగా వస్తుంది. నేను లిఫ్ట్ ఇస్తాను భయపడకండీ ఎక్కువగా నానిపోతారు అంటూ నమ్మబలికాడు. దీంతో కారు డ్రైవర్‌ను నమ్మిన ఆ మహిళ కారులో వెనుక సీట్‌లో ఎక్కేందుకు వెళ్లింది. వెనుక వద్దంటూ ముందుకు వచ్చి కూర్చోవాలని కోరాడు. దీంతో ఆ మహిళ కారులో ముందుకు వచ్చి కూర్చొంది. ఒకచోట పని ఉందని చెప్పి నిర్జీవ ప్రదేశానికి తీసుకువెళ్లాడు. ఎక్కడకు తీసుకుని వెళుతున్నావ్ అని ప్రశ్నించిన ఆమెకు సమాధానం ఇవ్వలేదు కారు డ్రైవర్. దీంతో ఆ మహిళ అరవడంతో చంపేస్తానంటూ బెదిరించాడు. ఆపై ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికి చెప్పకూడదని బెదిరించి ఆమెను కారులో నుంచి బయటకు తీసేశాడు. దయనీయ స్థితిలో ఉన్న మహిళను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటా హుటిన ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. కారు డ్రైవర్‌ను త్వరలో పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

# మంత్రి హారీష్‌రావును కలిసిన రిటైర్డు ఉద్యోగుల సంఘం నేతలు



మంత్రి హారీష్‌రావును కలిసిన విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు

హైదరాబాద్, జులై 21 ప్రభాతవార్త : రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆయన్ను కలుసుకున్నారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిసినవారిలో సంఘం సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్, కోశాధికారి ఎ.గంగారెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎం.శంకర్‌రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీ బి.ప్రహ్లాద్‌రావు, సంఘం నాయకుడు ఇందర్‌సింగ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రితో జరిగిన చర్చల వివరాలను సంఘం నేతలు వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగులకు హెల్త్‌కార్డులు పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. పెన్షన్లు ప్రతినెల 5వ తేదీ లోపు ఇచ్చేలా ప్రయత్నిస్తామని, కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ కారణంగా సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతోందని మంత్రి చెప్పినట్లు వారు వివరించారు. ఇతర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లతామని మంత్రి హామీ ఇచ్చారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# హిమాయత్ సాగర్ రెండు గేట్లు ఎత్తివేత

**హిమాయత్ సాగర్ రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలిన ఎమ్మెల్యే**

**రెండు గేట్లు ఒక ఫీటు పైకెత్తి 700 క్యూసెక్కుల నీరు విడుదల**

**లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన పాలకులు, అధికారులు**





హిమాయత్ సాగర్ జలాశయం వద్ద గేట్లు ఎత్తుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, హిమాయత్ సాగర్

నార్సింగి, జులై 21 ప్రభాతవార్త : దశాబ్దాల తరబడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న జంట జలాశయాలు ఈ సంవత్సరం వేగంగా నిండుతున్నాయి. గత మూడు రోజులుగా ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఎగువ ప్రాంతాలైన వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మోమిన్‌పేట, మొయినాబాద్ మండలాల నుంచి భారీగా వాగులు వరద నీటిని తీసుకువచ్చి గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాల్లో కలుస్తున్నాయి. హిమాయత్ సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50అడుగులు కాగా శుక్రవారం మధ్యాహ్నంకు 1732.50 అడుగలకు చేరింది. మరో అడుగు వస్తే పూర్తి స్థాయి నీటి మట్టంకు చేరుకుంటుంది. గండిపేట జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1790.అడుగులు కాగా ప్రస్తుతం 1785.40అడుగుల నీరు ఉంది. మరో నాలుగున్నర అడుగుల నీరు వస్తే ఈ జలాశయం నిండుతుంది. ఇప్పుడు పై నుంచి 1000.క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుంది. శుక్రవారం సాయంత్రం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య, డిసిపి జగదీశ్వర్‌రెడ్డి, జల మండలి జిఎం డేవిడ్ రాజ్, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కమీషనర్ శరత్‌చంద్ర, టౌన్‌ప్లానింగ్ డిసిపి సాంబయ్యలతో కలిసి 5.10.గేట్లను ఒక అడుగు గేట్లు పైకెత్తి నీటిని ఈసీ వాగులోకి వదిలిపెట్టారు. ఈ జలాశయంలోకి ఇన్‌ఫ్లో 1500.క్యూసెక్కులుండగా దిగువకు 700.క్యూసెక్కుల నీటిని వదిలి పెట్టడం జరిగింది. గేట్ల నుంచి వస్తున్న నీటిని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు ఎగబడ్డారు. నాయకులు, పోలీసులు, జర్నలిస్టులు, ప్రజలు నీటి పరుగును తిలకించి ఆనందపరవశులయ్యారు.

ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగర శివారుల్లోని హిమాయత్ సాగర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండడం ఆనందంగా ఉందన్నారు. మరో జలాశయం గండిపేట మరో నాలుగు అడుగుల కొత్త నీరు వస్తే దాని గేట్లు కూడా ఎత్తడం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ 9.ఏళ్ల పాలనలో 8.ఏళ్ల నుంచి జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్‌సాగర్‌లు నిండుతున్నాయన్నారు. ఈ రెండు జలాశయాలు హైదరాబాద్ ప్రజలకు ఏళ్ల తరబడి సరఫరా చేయడం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ కోసం కృష్ణ, గోదావరి నదీ జలాలు తీసుకు రావడంతో ఈ జలాశయాల నీటిని నగర ప్రజలకు సరఫరా చేయడం నిలిపి వేయడం జరిగిందన్నారు. దీంతో రెండు జలాశయాలు ఏడాది పొడవునా నిండుగా ఉండి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయన్నారు. తొలకరి వర్షాలకే పూర్తి స్థాయి సామర్థ్యంతో నిండడం వలన గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలామని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వివరించారు. అనంతరం జల మండలి ఎండి జనార్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి హిమాయత్ సాగర్ జలాశంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జల మండలి డిజిఎం రేణుక, బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు రాము, సాగర్‌గౌడ్, అస్లాం, కాంగ్రెస్ సీనియర్ నేత ఆంజనేయులు, నాయకులు గోపాల్ ముదిరాజ్, ఎ.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశాము : మేయర్**

హిమాయత్ సాగర్ జలాశయం గేట్లు ఎత్తుతుండడంతో రెవెన్యూ, జిహెచ్‌ఎంసి, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది అందరం కలిసి లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని బండ్లగూడ జాగీర్ మేయర్ మహేందర్‌గౌడ్ తెలిపారు. కిస్మత్‌పూర్, అత్తాపూర్, లంగర్‌హౌస్ బాపూఘాట్, కార్వాన్, పురానాపూల్ వరకు ఈసీ,మూసీ వాగులకు ఇరువైపులా ఉన్న ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు.

# పద్మాకాలనీ ప్రాంతాన్ని పరిశీలించిన జిహెచ్‌ఎంసి కమిషనర్



పనులను పరిశీలిస్తున్న జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోజ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జులై 21 ప్రభాతవార్త: వర్షాల కారణంగా హుస్సేన్‌సాగర్‌కు ఎగువ నుంచి భారీఎత్తున వరదనీరు వచ్చే చేరుతోందని, నీటి విడుదల జరుగుతున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మాకాలనీ ప్రాంతంలో రోనాల్డ్ రోజ్ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి వరద ముంపు సమస్యలు, ఎదురయ్యే ఎటువంటి అన్ని ఇబ్బందులపై ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా నాలా స్లాబ్ నిర్మాణ పనులను పరిశీలించి, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాలాపై చేపడుతున్న స్లాబ్ పనులను పరిశీలించిన అనంతరం పనుల ప్రగతిపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. వరద ముప్పు తలెత్తే ప్రమాదం ఉందని, త్వరితగతిన పనులు వేగాన్ని పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, రోడ్లపై ఉన్న మట్టికుప్పలను తొలగించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు అవసరమైన సేవలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిది కలగకుండా ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యంగా లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర బృం దాలు పని చేస్తున్నాయని, ప్రత్యేకంగా నీటి తొలగింపునకు 157 స్టాటిక్ బృందాలు వరదకు అడ్డుగా ఉన్న వ్యర్థాల తొలగింపు పనులు చేపడుతన్నాయని, 339 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మణిపూర్ మహిళల నగ్న ఊరేగింపు దోషం మోడీ సర్కార్‌దే



కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న శరత్ నాయక్

తార్నాక, జులై 21 ప్రభాతవార్త: మణిపూర్ రాష్ట్రంలో మహిళల నగ్న ఊరేగింపు భాద్యత మోడి సర్కార్‌దే నని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ పేర్కొన్నారు. మణిపూర్‌లో జరిగిన మహిళల నగ్న ఊరేగింపును నిరసిస్తూ ఓ.యూలో గిరిజన శక్తి ఆద్వర్యంలో శుక్రవారం ప్రధాని మోది దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శరత్ నాయక్ మాట్లాడుతూ సుమారు 3నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవాడంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య, డిబిఎస్‌ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, రమేష్ ముదిరాజ్, డిపిఎస్‌యూ నాయకులు సుమంత్, ఎస్ఎస్‌యూ విద్యార్థి నాయకులు సతీస్, ఆంస ఓ.యూ అధ్యక్షులు సైదులు, హన్మంతు నాయక్, వినయ్, వినోద్, సతీష్, కళ్యాణ్, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డికి అభినందనల వెల్లువ



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, జులై 21, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న శుభసందర్భంగా కూకట్‌పల్లి చెందిన పలువురు బిజెపి నాయకులు అభినందనలు తెలియజేశారు. కూకట్‌పల్లికి చెందిన సీనియర్ నాయకులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని కలిసి శుభాభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లికి చెందిన పలువురు బిజెపి నాయకులు కార్యర్తలు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలి : పిడమర్తి రవి



కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన పిడమర్తి రవి

కంటోన్మెంట్, జులై 21 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, కాంగ్రెస్ నేత పిడమర్తి రవి తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ 4వ వార్డు లక్ష్మి నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి.వై.సత్య నారాయణ, కుమార్, రవి, నాగిరెడ్డి, రాజశేఖర్,రామక్రిష్ణ, ఆనంద్, సాంబ, శివ పాల్గొన్నారు.

## జి.కిషన్‌రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు



కేంద్రమంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని జిహెచ్‌ఎంసి బిజెపి విప్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కలిసినప్పటి చిత్రం

మైలార్‌దేవ్‌పల్లి,జులై 21 ప్రభాతవార్త : కేంద్రమంత్రి,రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు కలిశారు.రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా జి.కిషన్‌రెడ్డి శుక్రవారం నాంపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మంచిరేవుల సర్వీసు రోడ్డుపై పడ్డ పెద్ద బండరాయి

నార్సింగి, జులై 21 ప్రభాతవార్త : ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గండిపేట మండలం మంచిరేవుల గ్రామం వద్ద ఉన్న ఔటర్ సర్వీసు రోడ్డు ఫుట్‌పాత్‌పై పెద్ద బండరాయి కూలి పడింది. ఆగకుండా వర్షానికి మట్టి అంతా కరిగిపోయి పెద్ద బండరాయి దిగువకు జారి పడిపోయింది. అదృష్టవశాత్తు అది రోడ్డుపైకి రాలేదు. ఫుట్‌పాత్‌పైనే ఆగిపోయింది. ఇది కూలిపోయిన ప్రాంతంలోనే మరో పెద్ద బండరాయి సైతం కూలేందుకు సిద్దంగా ఉంది. సంబంధిత శాఖ అధికారులు ఈ బండరాళ్ల వలన వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



బేగంపేట జులై 21,ప్రభాతవార్త : బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ఓల్డ్ వెల్ గేట్ ఏరియాలో చోటు చేసుకుంది.ఈ సంఘటనపై సెక్యూరిటీ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసుల కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూలు సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లింగంపల్లి నర్సింహాచారి ఈ నెల 20వ తేదీన విధులు నిర్వర్తిస్తున్నాడు.ఈ సమయంలో హెచ్‌పీఎస్ ఓల్డ్‌వెల్ గేట్ ఏరియా లో సుమారు 40నుంచి 45సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వ్యక్తి తలకు గాయాలతో పడి ఉండటాన్ని గమనించాడు.ఇదే విషయాన్ని హెచ్‌పీఎస్ ఎస్టేట్ మేనేజర్ ప్రణీత్ దృష్టికి తీసికెళ్లాడు. వెంటనే అతను 108కు కాల్ చేయడంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అతన్ని పరిశీలించిన 108సిబ్బంది అతను చనిపోయినట్లు చెప్పారన్నారు.మృతి చెందిన వ్యక్తి ఒంటిపై కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని,వయస్సు సుమారు 40నుంచి 45సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు.సెక్యూరిటీ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని,ఎస్సై కోర్వ గంగాధర్ తెలిపారు.మృతుని గురించి స్థానికంగా విచారించినా ఎవరూ గుర్తించలేదన్నారు.మృతుని గుర్తించిన వారు బేగంపేట పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## 23న బాలంరాయి దండు మారెమ్మ బోనాలు.. 24న రంగం



దండు మారెమ్మ బోనాల జాతర పై వివరాలను వెల్లడిస్తున్న ఈఓ

బేగంపేట జులై 21,ప్రభాతవార్త : బాలంరాయి దండు మారెమ్మ బోనాల జాతర అంగ రంగ వైభవంగా ఈ నెల 23న బోనాలు,24న రంగం కార్యక్రమం జరుగుతుందని,ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసశర్మ వెల్లడించారు.శుక్రవారం బాలంరాయిలోని ఆలయ ఆవరణలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో కల్సి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈ ఓ మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు.23వ తేదీన ఉదయం గం 5లకు అఖండ దీపారాధన ,విఘ్నేశ్వర పూజ,అభిషేకం,సహస్ర నామార్చన,మంగళహారతి,మంత్రపుష్పం,తదుపరి బోనం సమర్పణ,తీర్ధ ప్రసాద వితరణ,సాయంత్రం గం 6లకు ఫలహార బండ్ల మరియూ తొట్టెల ఊరేగింపు ఉత్సవాలు జరుగుతాయన్నారు.24న ఉదయం గం 3లకు బస్తీలో బలి చల్లడంతో పాటు అమ్మ వారి విశేష అలంకార దర్శనం, గం 12లకు రంగం కార్యక్రమం సాయంత్రం గం 5లకు గావు కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో ఈ ఓ శ్రీనివాసశర్మతో పాటు ముప్పిడి గోపాల్,రమేష్, శ్రీను, దళిత రత్న దర్గ రవికుమార్,వి.నరేష్,సర్వేష్,హీరాలాల్,శంకర్,చిన్నా పాల్గొన్నారు.

## రేసింగ్ కార్ల రిజిస్ట్రేషన్లు పరిశీలించిన ఎంవిఐ



నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఉన్న రేసింగ్ కార్ల రిజిస్ట్రేషన్లను పరిశీలించిన అత్తాపూర్ ఎంవిఐలు

నార్సింగి, జులై 21 ప్రభాతవార్త : కోకాపేట్ మూవీ టవర్స్ వద్ద రేసింగ్‌లో పట్టుబడ్డ నాలుగు కార్ల రిజిస్ట్రేషన్‌లను శుక్రవారం అత్తాపూర్ ఆర్టీఏ కార్యాలయంకు చెందిన ఎంవిఐ సురేందర్‌రెడ్డి నార్సింగి పోలీసు స్టేషన్‌కు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగి పోలీసుల విన్నపం మేరకు ఈ తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల కోసం నాలుగు కార్ల ఓనర్లకు డ్యాక్యుమెంట్లు తీసుకొని రావాలని సూచించామని, ఇద్దరే వచ్చారని వివరించారు. మరో ఇద్దరు అందుబాటులో లేరని తెలిపారు. నాలుగు కార్ల రిజిస్ట్రేషన్ నెంబర్ల ఆధారంగా వాటి ఇంజన్, చాసిస్ నెంబర్లు కరెక్టు ఉన్నాయా? లేవా? ఓనర్లు మన రాష్ట్రానికి చెందిన వారా? లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా? పూర్తి వివరాలతో కూడిన సమాచారంను ఇవ్వాలని పోలీసులు మాకు సూచించారని పేర్కొన్నారు. మా పరిశీలనలో రెండు కార్లు మహారాష్ట్ర, మరో రెండు కార్లు పాండిచ్చేరి ప్రాంతాలకు చెందినవిగా గుర్తించామని, వీటి ఓనర్లు మన రాష్ట్రంలోనే ఉంటూ లైఫ్ ట్యాక్స్‌ను ఎగ్గొట్టాలన్న ఉద్దేశంతోనే ఇతర రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు తేలిందన్నారు.

## ఎడతేరిపి వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, జులై 21 ప్రభాతవార్త: ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపధ్యంలో శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గోల్నాక డివిజన్‌లోని ఖాజాగరిబ్ నగర్, కృష్ణానగర్, లంక, శాస్త్రీనగర్, కమలానగర్ ప్రాంతాలలో పర్యటించారు. రోడ్లపై నిలిచిన నీరు, వీధులను, కాల్వలను, డ్రైనేజీలు, అక్కడక్కడ కూలీన చెట్లను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కరెంట్ స్తంబాలు, ట్రాన్స్‌పారాలకు ప్రజలు దూరంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న, చెట్లు పడిపోయిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు సూచించారు. పాత ఇళ్ళలో నివసించే ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి

### టిఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు




సమావేశంలో మాట్లాడుతున్న గ్యాదరి బాలమల్లు

నాచారం. జులై 21 ప్రభాతవార్త: పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని టిఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు పేర్కొన్నారు. ఆరెజిన్ లైఫ్ సైన్సెస్ ఆర్థిక సహకారంతో కార్పోరేటర్ సమాజిక భాధ్యతలో భాగంగా రూ. 10 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన మల్లాపూర్ నాలాపై బ్రిడ్జి, వరద పైపులైన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా హాజరైన టిఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం ఆరెజిన్ లైఫ్ సైన్స్‌సెస్ సంస్థ ముందుకు రావడం హర్షనీయం అన్నారు. అనంతరం టిఎస్ఐఐసీ ఎండి ఈ.వి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ ఆరిజన్ సంస్థ సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. ప్రజా సమస్యను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సహయం చేసేందుకు ముందుకురావడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ఎంఐఏఎస్ఎ ఛైర్మన్ కె.మహిపాల్ రెడ్డి, కార్యదర్శి వి.బాల్‌రాజ్,జాయింట్ సెక్రటరీ ఎస్.వెంకటేశ్వర్ రావు, కోషాదికారి సర్ధార్ ఖ్వాన్, టిఎస్ఐఐసీ ప్రాజెక్ట్ సిఈవో వి.మధుసూధన్,చీఫ్ ఇంజనీర్ కె.శ్యాసుందర్, మల్లాపూర్ ఐలా జోనల్ మేనేజర్ మాధవి, కమీషనర్ ఉమామహేశ్వర్, డి.ఇ. అంజయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ అనిల్, డిజెడ్ఎం శిల్ప, మేనేజర్ పురేందర్, మల్లాపూర్ ఐలా ఛైర్మన్ మహేందర్ రెడ్డి, అసోషియేషన్ అధ్యక్షులు కరణ్ రెడ్డి,వైస్ ఛైర్మన్ భుషన్ రావు, కార్యదర్శి డా. ఎన్ఆర్. శ్రీనివాస్, ఐలా సెక్రటరీ బాల్‌రాజ్, ఉపకార్యదర్శి హుసేనయ్య, కోషాదికారి ఎల్‌విఆర్ శాస్త్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విక్రమ్‌గౌడ్‌తో ఈటెల భేటీ

గోషామహల్,జులై 21ప్రభాతవార్త: ఎం.జె.మార్కెట్‌లోని మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు మూల విక్రమ్‌గౌడ్‌తో బిజెపి శాసన సభ్యులు, బిజెపి ఎన్నికల నిర్వాహణ కమిటి ఛైర్మన్ ఈటెల రాజేందర్ భేటి అయ్యారు.సుమారు గంటపైగా గోషామహల్ నియోజక వర్గంలోని తాజా రాజకీయాలపై చర్చించుకున్నారు. రెండు రోజుల క్రితం శాసనసభ్యులు టి.రాజాసింగ్‌ను కలిసిన విషయం తెలిసిందే. శుక్రవారం విక్రమ్‌గౌడ్‌తో ఈటెల భేటి కావడంతో రాజకీయ ప్రాధాన్యతసంతరించుకుంది. అనంతరం విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ గోషామహల్ నియోజక వర్గం నుంచే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉంటానన్నారు.అవసర మనుకుంటే టి.రాజాసింగ్ ఇంటికివెళ్లి మద్దతు కూడా కోరతానన్నారు. నాకుటుంబానికి గోషామహల్ నియోజకవర్గం ప్రజలతో 40 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. రాజాసింగ్‌పై పెట్టిన సస్పెషన్ బిజెపి కేంద్ర అధిష్టానం పరిధిలో ఉందన్నారు.

## సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పుర, జులై 21 ప్రభాతవార్త : పాతబస్తీ హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన పూజలు ఘనంగా జరిగాయి. నాలుగు వారాలు కుంకుమార్చన పూజలో పాల్గొన్న 400 మంది మహిళలకు ఆలయ కమిటి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రసాదంగా చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయకమిటి అధ్యక్షులు రామ్‌దేవ్ అగర్వాల్, ప్రతినిధులు కె.దత్తాత్రేయ,ఎ.సతీష్ కుమార్, రాజారత్నం,డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్, డి.ఆర్. ప్రభాకర్, ఎస్.పి.క్రాంతికుమార్, జగన్మోహన్ కపూర్,టి.రమేష్ బాబు,జి.రాజు,పి.మహేష్,ఈశంత్ సూరి,శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



1వ వార్డులో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఇటుక శ్రీకిషన్ మాదిగ, రాగటి సత్యం మాదిగ

అడ్డగుట్ట, జులై 21 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఆగస్టు 2వ వారంలో తలపెట్టనున్న విశ్వరూప మహా సభను విజయంతం చేసేందుకు మాదిగ ఉపకులాలన్నీ ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ రాగటి సత్యం మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మంద కుమార్ మాదిగ, గణేష్ మాదిగ, ఉపేందర్ మాదిగ, నర్సయ్య మాదిగ, శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ చానెల్ ఈదిన దివ్యాంగ స్విమ్మర్స్‌లో తెలంగాణ దివ్యాంగుడు



ధర్నాచౌక్, జులై 21, ప్రభాతవార్త: ఇంగ్లీష్ చానెల్ ఈదిన మొట్ట మొదటి భారతీయ దివ్యం స్విమ్మర్స్‌లో తెలంగాణలోని మెదక్ జిల్లాకు చెందిన దివ్యాంగుడు శివకుమార్ ఉండటం విశేషం. భారత దేశానికి చెందిన ఆరుగురు దివ్యాంగ స్విమ్మర్స్ ఆసియా ఖండంలోనే ఇంగ్లీషన చానెల్ ఈది సరికొత్త రికార్డు నెలకొల్పారు. హైదరాబాద్‌కు చెందిన కోచ్ దినేష్ రాజోరియా తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8న ఇంగ్లీష్ చానెల్ ఈదడానికి బ్రిటన్ రాజధాని లండన్‌కు వివిధ రాష్ట్రాల నుండి ఆరుగురు వెళ్లారు. ఈ నెల 18 ఉదయం 3 గంటలకు ఇంగ్లీష్ చానెల్ ఈదటం ప్రారంభించిన వారు కేవలం 31 గంటలలోనే 78 కిలోమీటర్లు ఈది విజయం సాధించారు. ఈదిన వారిలో మన రాష్ట్రం నుండి మెదక్‌జిల్లాకు చెందిన శివకుమార్ కుస్నూర్, పశ్చిమ బెంగాల్ కు చెందిన రిమోసాహో, తమిళనాడుకు చెందిన స్నేహన్, అస్సాంకు చెందిన ఎల్విస్ అలీ హాజారికా, మహారాష్ట్రకు చెందిన జయంత్ దూబుల్ ఉన్నారు. ప్రముఖ కోచ్ దినేష్ రాజోరియా శిక్షణలో మొట్టమొదటి దివ్యాంగ స్విమ్మర్స్‌గా రికార్డు సృష్టించి, భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి, రికార్డు నెలకొల్పిన వారిని చానెలదద్ స్విమ్మింగ్ అండ్ పిలోటింగ్ ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు మన దేశానికి చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా అభినందించారు.

## మణిపూర్ మారణహోమానికి వ్యతిరేకంగా మహిళలు నిరసన




అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న మహిళలు

సైఫాబాద్, జులై 21 ప్రభాతవార్త:మణిపుర్‌లోని కుకి తెగకు చెందిన ముగ్గురు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగిక దాడి చేయడాన్ని ఖండిస్తూ అనేక మంది మహిళలు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘాలు, ట్రాన్స్‌జెండర్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, జర్నలిస్టులు సజయ, వనజ, వేణుగో పాల్, పిఓడబ్ల్యూ నాయకురాళ్ళు వి.సంధ్య, భారతి, వివిధ సంఘాల ప్రతినిధులు మల్లు లక్ష్మీ, భూమిక సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల మధ్య మనతోన్మాదులు చిచ్చు రగిలిస్తున్నారని, వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వారు అధికారంలో వున్న రాష్ట్రాల్లో హింసను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. తెగల మధ్య ఘర్షణ పెంచి పోషిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఖరి వల్ల ఇప్పటి వరకు 160 మంది ప్రాణాలను కోల్పోయారని, ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించడం సిగ్గు చేటని, ఎంతో మంది మహిళలు అత్యాచారాలకు, వేదింపులకు గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## ప్రకృతి దినోత్సవం సందర్భంగా విద్యార్ధులకు పలు పోటీలు

చార్మినార్,జులై 21 ప్రభాతవార్త : ప్రకృతి పరిరక్షణ,అంతర్జాతీయ పులి దినోత్సవం సందర్భంగా ఈ నెల 28,29 తేదీలలో ప్రైమరీ,సెకెండరీ పాఠశాలల విద్యార్ధులకు క్విజ్, డ్రాయింగ్,క్రాప్ట్ మేకింగ్,ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్ తెలిపారు.జులై నెల 28వ తేదీన ఉదయం 10.30 నుంచి 11.30 గంటలు వరకు ప్రకృతి పరిరక్షణపై సెకెండరీ స్కూల్ విద్యార్ధులకు క్విజ్ పోటీలు, పులి పరిరక్షణపై విద్యార్ధులకు డ్రాయింగ్ పోటీలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. జులై 28వ తేదీ ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకు ప్రైమరీ విద్యార్ధులకు క్రాఫ్ట్ మేకింగ్ పోటీలు,11.45 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సెకెండరీ స్కూల్ విద్యార్ధులకు టైగర్స్ సేవ్ అన్న అంశంపై ఉపన్యాసం పోటీలు జరుగనున్నాయి.

## 'ఆదివాసీ మహిళ నగ్నంగా ఊరేగింపుపై బిజెపి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి




ప్రజాసంఘాల నిరసన ప్రదర్శన

చిక్కడపల్లి, జులై 21 ప్రభాతవార్త: బిజెపి పాలిత మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ గిరిజన మహిళను నగ్నంగా ఊరేగించిన దుండగును కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ మణిపూర్ బిజెపి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని కోరుతూ సామాజిక మహిళా ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఐద్వా, సిఐటియు, ఏఐఏడబ్ల్యు, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద నిరసన ప్రదర్శన ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అధ్యక్షతన జరిగింది. ఐద్వా, సిఐటియు, ఏఐఏడబ్ల్యు, కెవిపిఎస్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు మల్లులక్ష్మి, పాలడుగు భాస్కర్, ఆర్.వెంకట్రాములు, టి.స్కైలాబ్‌బాబు, అన్నేగంటి వెంకటేష్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా మణిపూర్‌లో మతద్వేషాలు రెచ్చగొట్టి పదుల సంఖ్యలో ప్రాణాలు బలిగావటానికి మతోన్మాద బిజెపి సర్కార్ వైఫల్యమేనని అన్నారు. బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌కు ఢిల్లీ కోర్టు జులై 20న బెయిల్ మంజూరుచేసిందని, బెయిల్ వెనక్కి తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్‌చేశారు. ఐద్వా నాయకురాలు మద్దెల వినోద, శశికళ, పద్మ, రాష్ట్ర కమిటీ నాయకులు స్వరూప, సిఐటియు రాష్ట్ర నాయకులు ఎస్వీ.రమ, వంగూరి రాములు, శ్రీకాంత్, కూరపాటి రమేశ్, యాటల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పీఎస్ విధ్యార్థులు బెస్ట్‌ఫర్‌ది వరల్డ్ గా ఉండాలి

### లార్డ్‌కరణ్ బిలిమోరియా



హెచ్‌పీఎస్‌లో నిర్వహించిన విద్యార్థుల నాయకత్వ స్వీకారోత్సవం

బేగంపేట జులై 21,ప్రభాతవార్త : బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విధ్యార్థులు బెస్ట్ ఫర్ ది వరల్డ్‌గా ఎదగాల్సిన అవసరం ఉందని,ముఖ్య అతిధి లార్డ్ కరణ్ బిలిమోరియా అన్నారు.తను చదువుకున్న పాఠశాలకు అతిధిగా రావడంపై ఆయన సంపూర్ణ ఆనందాన్ని వ్యక్తంచేసారు.బేగంపేట హెచ్ పీ ఎస్ లో శుక్రవారం ఉదయం విధ్యార్ధుల నాయకత్వ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది.శత వసంతాల హెచ్‌పీఎస్ లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది.2023 2024సంవత్సరానికి గాను విధ్యార్ధులకు వివిధ రకాలైన నాయకత్వ బాధ్యతలను అప్పగించారు.ఎయిర్ ఛీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరి ఈ వేడుకకు మరో ముఖ్య అతిధిగా హాజరు కాగా ప్రత్యేక అతిధిగా ఏఎఫ్ డబ్ల్యు డబ్ల్యు ఏ అధ్యక్షురాలు నీతా చౌదరి హాజరయ్యారు.గౌరవ అతిధిగా చెల్సియా లార్డ్ కరణ్ బిలిమోరియా లు హాజరయ్యారు. ఈ సాంప్రదాయ వేడుకలలో హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ నోరియా ,హెచ్‌పీఎస్ సొసైటీ వైస్ ప్రెశిడెంట్, బీఒజీ సభ్యుడు ఫయాజ్ ఖాన్,సెక్రటరీ, ట్రెజరర్ జలగం వెంకటరావు,కార్యదర్శి ఎం.రాధారెడ్డి, హెచ్‌పీఎస్ సొసైటీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్లు,గౌరవనీయ సభ్యులు పాల్గొన్నారు. నాగార్జున,నలంద, తక్షశిల,విజయన గరం విభాగాల ఆధ్వర్యంలో ఆయా రంగుల జెండాలు,పాఠశాల జెండాలతో నిషాన్ టోలి నేతృత్వంలో కవాతును నిర్వహించారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT:
AT : L.B. NAGAR.
I.A. No.331 Of 2022
IN
O.S No.1234 Of 2015

Between:
**M.C. Jabez @ Ebenezer,** ...Petitioner/Plaintiff
AND
**M.C. Jacob & Others,** ...Respondents/Defendants

To,
1. **M.C. Jacob,** S/o. Late. M.P. Charles
2. **G.J. Yesudas,** died per Lrs
3. **G.J. Prakasham,** Died per LRS
4. **Smt Gunti Kanthamma,** W/o. Late G.J. Yesudas,
5. **Gunti Sathi Raj,** S/o. Late G.J. Yesudas,
6. **Gunti Anandam,** S/o. Late G.J. Yesudas,
7. **Gunti Devapriyam,** S/o. Late G.J. Yesudas,
8. **Gunti Zecharaiah,** S/o. Late G.J. Yesudas,
9. **Gunti John,** S/o. Late G.J. Yesudas,
10. **Smt. G. Rachel,** D/o. Late G.J. Yesudas,
All 4 to 10 are R/o. H.No.3-41, Kothwalguda (V), Shamshabad (M), Ranga Reddy District, T.S. ...Respondents/Defendants

Sirs,
Please take notice that the plaintiff filed above suit for partition and separate possession against the defendants in respect suit schedule property. The defendant No.2 (G.J. Yesudas) died on 02-04-2016, leaving behind his wife, 5 sons and one daughter, who are proposed defendant No.4 to 10. The above I.A and suit is posted to 28-07-2023 at 10.30 a.m. before the above court and the above I.A and suit is posted for your notice, if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.
(BY ORDER OF COURT)
Sd/- KASOJU YADAGIRI (AP3045/95)
ADVOCATE
Sri Sai Nilayam # 9-1-33/29/A, Prashanth Nagar, Langer Houz, Hyderabad - 500 008. T.S.
Cell : 9848827443, 9440384443
E-mail : kasojugiriadv@gmail.com

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT:
AT : L.B. NAGAR.
I.A. No.332 Of 2022
IN
O.S No.1234 Of 2015

Between:
**M.C. Jabez @ Ebenezer,** ...Petitioner/Plaintiff
AND
**M.C. Jacob & Others,** ...Respondents/Defendants

To,
1. **M.C. Jacob,** S/o. Late. M.P. Charles
2. **G.J. Yesudas,** died per Lrs
3. **G.J. Prakasham,** Died per LRS
4. **Smt Gunti Kanthamma,** W/o. Late G.J. Yesudas,
5. **Gunti Sathi Raj,** S/o. Late G.J. Yesudas,
6. **Gunti Anandam,** S/o. Late G.J. Yesudas,
7. **Gunti Devapriyam,** S/o. Late G.J. Yesudas,
8. **Gunti Zecharaiah,** S/o. Late G.J. Yesudas,
9. **Gunti John,** S/o. Late G.J. Yesudas,
10. **Smt. G. Rachel,** D/o. Late G.J. Yesudas,
All 4 to 10 are R/o. H.No.3-41, Kothwalguda (V), Shamshabad (M), Ranga Reddy District, T.S. ...Respondents/Defendants

Sirs,
Please take notice that the plaintiff filed above suit for partition and separate possession against the defendants in respect suit schedule property. The defendant No.2 (G.J. Yesudas) died on 02-04-2016, leaving behind his wife, 5 sons and one daughter, who are proposed defendant No.4 to 10. The above I.A and suit is posted to 28-07-2023 at 10.30 a.m. before the above court and the above I.A and suit is posted for your notice, if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.
(BY ORDER OF COURT)
Sd/- KASOJU YADAGIRI (AP3045/95)
ADVOCATE
Sri Sai Nilayam # 9-1-33/29/A, Prashanth Nagar, Langer Houz, Hyderabad - 500 008. T.S.
Cell : 9848827443, 9440384443
E-mail : kasojugiriadv@gmail.com

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT:
AT : L.B. NAGAR.
I.A. No.333 Of 2022
IN
O.S No.1234 Of 2015

Between:
**M.C. Jabez @ Ebenezer,** ...Petitioner/Plaintiff
AND
**M.C. Jacob & Others,** ...Respondents/Defendants

To,
1. **M.C. Jacob,** S/o. Late. M.P. Charles
2. **G.J. Yesudas,** died per Lrs
3. **G.J. Prakasham,** Died per LRS
4. **Smt Gunti Kanthamma,** W/o. Late G.J. Yesudas,
5. **Gunti Sathi Raj,** S/o. Late G.J. Yesudas,
6. **Gunti Anandam,** S/o. Late G.J. Yesudas,
7. **Gunti Devapriyam,** S/o. Late G.J. Yesudas,
8. **Gunti Zecharaiah,** S/o. Late G.J. Yesudas,
9. **Gunti John,** S/o. Late G.J. Yesudas,
10. **Smt. G. Rachel,** D/o. Late G.J. Yesudas,
All 4 to 10 are R/o. H.No.3-41, Kothwalguda (V), Shamshabad (M), Ranga Reddy District, T.S.
11. **Smt Gunti Meramma,** W/o Late G.J. Prakasham,
12. **Smt Gunti Lilly,** D/o. Late G.J. Prakasham,
13. **Smt D. Rosy,** D/o. Late G.J. Prakasham,
14. **Smt Gunti Samson,** S/o Late G.J. Prakasham,
15. **Smt S.K. Drakshavali,** D/o Late G.J. Prakasham,
16. **Gunti Jacobson,** S/o Late G.J. Prakasham,
17. **Smt B. Blessy,** D/o. Late G.J. Prakasham,
All 12 to 18 R/o H.No.1-5-82, Budvel (V), Rajendranagar (M), Ranga Reddy District, T.S. ...Respondents/Defendants

Sirs,
Please take notice that the plaintiff filed above suit for partition and separate possession against the defendants in respect suit schedule property. The defendant No.3 (G.J. Prakasham) also died on 16-09-2017, leaving behind his wife, 2 sons and 4 daughters, who are proposed defendant No.11 to 17. The above I.A and suit is posted to 28-07-2023 at 10.30 a.m. before the above court and the above I.A and suit is posted for your notice, if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.
(BY ORDER OF COURT)
Sd/- KASOJU YADAGIRI (AP3045/95)
ADVOCATE
Sri Sai Nilayam # 9-1-33/29/A, Prashanth Nagar, Langer Houz, Hyderabad - 500 008. T.S.
Cell : 9848827443, 9440384443
E-mail : kasojugiriadv@gmail.com

IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT:
AT : L.B. NAGAR.
I.A. No.334 Of 2022
IN
O.S No.1234 Of 2015

Between:
**M.C. Jabez @ Ebenezer,** ...Petitioner/Plaintiff
AND
**M.C. Jacob & Others,** ...Respondents/Defendants

To,
1. **M.C. Jacob,** S/o. Late. M.P. Charles
2. **G.J. Yesudas,** died per Lrs
3. **G.J. Prakasham,** Died per LRS
4. **Smt Gunti Kanthamma,** W/o. Late G.J. Yesudas,
5. **Gunti Sathi Raj,** S/o. Late G.J. Yesudas,
6. **Gunti Anandam,** S/o. Late G.J. Yesudas,
7. **Gunti Devapriyam,** S/o. Late G.J. Yesudas,
8. **Gunti Zecharaiah,** S/o. Late G.J. Yesudas,
9. **Gunti John,** S/o. Late G.J. Yesudas,
10. **Smt. G. Rachel,** D/o. Late G.J. Yesudas,
All 4 to 10 are R/o. H.No.3-41, Kothwalguda (V), Shamshabad (M), Ranga Reddy District, T.S.
11. **Smt Gunti Meramma,** W/o Late G.J. Prakasham,
12. **Smt Gunti Lilly,** D/o. Late G.J. Prakasham,
13. **Smt D. Rosy,** D/o. Late G.J. Prakasham,
14. **Smt Gunti Samson,** S/o Late G.J. Prakasham,
15. **Smt S.K. Drakshavali,** D/o Late G.J. Prakasham,
16. **Gunti Jacobson,** S/o Late G.J. Prakasham,
17. **Smt B. Blessy,** D/o. Late G.J. Prakasham,
All 12 to 18 R/o H.No.1-5-82, Budvel (V), Rajendranagar (M), Ranga Reddy District, T.S. ...Respondents/Defendants

Sirs,
Please take notice that the plaintiff filed above suit for partition and separate possession against the defendants in respect suit schedule property. The defendant No.3 (G.J. Prakasham) also died on 16-09-2017, leaving behind his wife, 2 sons and 4 daughters, who are proposed defendant No.11 to 17. The above I.A and suit is posted to 28-07-2023 at 10.30 a.m. before the above court and the above I.A and suit is posted for your notice, if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.
(BY ORDER OF COURT)
Sd/- KASOJU YADAGIRI (AP3045/95)
ADVOCATE
Sri Sai Nilayam # 9-1-33/29/A, Prashanth Nagar, Langer Houz, Hyderabad - 500 008. T.S.
Cell : 9848827443, 9440384443
E-mail : kasojugiriadv@gmail.com

DEBTS RECOVERY TRIBUNAL, HYDERABAD-2
3rd Floor, Triveni Complex, Hotel Palace Heights Building, Abids, AT HYDERABAD.
O.A. No. 133 OF 2023
Somment under inb-section (4) of Section19 of the Act, read with sub-ule (24) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.)
Union Bank Of Union Bank Of India,
Vs
M/s A-1 Cold Storage Private Limited and others
To
1) M/s A-1 Cold Storage Private Limited, F.No.G-1, # 6-3-1104, Priya Surpass Apartments, Raj Bhavan Road, Somajiguda, Hyderabad- 500082, T.S.
2) Mrs Duvvuru Varija, Director, w/o D.Subba Rami Reddy, Major, H.No.36, Santosh Nagar, Mehdipatnam, Hyderabad-500028.
3) Mrs Bollu Hymavathi, Director, w/o Bollu Srinivasa Rao, Major, G-3, Visishta Apartments, Kothapet, Chirala, Prakasham District- A.P-523157.
4) Mr Kolanu Srinivas Reddy, Guarantor, s/o Tulasi Reddy, Major, # 1-2-47/4 & 5, Nizampet Road, Nizampet Village, Quthbullpur Mandal, R R District- 500049, T.S.
5) Mr Bollaboina Shekar, Guarantor, s/o B.Muthyalu, Major, #3-83/1/A/2/1, Gokul Nivas Apartments, Nizampet, Kukatpally, Hyderabad-T.S.
6) Mr Madhanachary Kanchari, Director, s/o Monachary Kanchari, 32 years, # 2-28, Nancherla, Gandeed, Rangareddy-509337, T.S.
...Defendants
SUMMONS/SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION
Whereas, **O.A. No.133 of 2023** is listed before Registrar, DRT-II On: **07-07-2023.**
Whereas the Honourable Tribunal-II is pleased to issue summons/ notice through paper publication on the said Application U/s 19(4) of the Act, the above O.A filed against you for recovery of debt of **Rs.7,48,34,818-38ps/-**
In accordance with Sub-section (4) of the Section 19 of Recovery of Debts Due to the Banks and Financial Institutions Act, 1993, you the defendants are directed as under:
I. To show cause with in thirty days of the service of the summons to you, why relief prayed should not be granted;
ii. To disclose particulars of the assets other than properties and assets specified by the Applicant under serial number 3A of the Original Application;
iii. You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application pending hearing and disposal of the Application for attachment of the properties;
iv. You shall not be transferred by way of sale, lease or otherwise except in the ordinary course of his business any of the assets over which security interest created and/or other assets and properties specified or disclosed under serial no. 3A of the Original Application without prior approval of the Tribunal;
V. You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or Financial Institutions holding security interest over such assets.
You are also directed to file written statement with a copy thereof furnished to the Applicant and to appear before the Registrar, Debts Recovery Tribunal-II, On -21-08-2023 at 10-30 A.M, failing which the Application shall be heard and decided in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 07th Day of July 2023.
Signature of the Officer Authorized to issue summons.

# చినుకు పడితే కునుకు కరువు

## వర్షాలతో కాలనీవాసుల ఇక్కట్లు వివినగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



వరద నీటి దృశ్యాలు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీ వ్యవస్థ దృశ్యం

ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త : వర్షాలు కురిస్తే కాలనీవాసుల పరిస్థితి దయనీయంగా తయారవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు గత అనుభవాలను మర్చిపోవడంతో కాలనీవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. గడ్డిఅన్నారం డివిజన్ వివినగర్‌కాలనీ గత రెండు రోజులుగా మురుగునీరు, వర్షం నీరుతో మునిగిపోతుంది. చాలా సంవత్సరాలుగా వర్షాకాలంలో గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పలుకాలనీలలో ముంపునకు గురవుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో డివిజన్లోని పలు కాలనీలు ముంపునకు గుర

### గత అనుభవాలను మరిచిన అధికారులు, ప్రజాప్రతినిధులు

వుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలలో పర్యటిస్తూ అది చేస్తాం ఇది చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు తప్ప వారి హామీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ట్రంక్‌లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీలు ముంపున గురి కాకుండా చర్యలు చేపడతామని స్వయంగా మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినప్పటికీ గత మూడు సంవత్సరాలుగా మంత్రి కేటీఆర్ హామీ అమలకు నోచుకోకపోవడం పట్ల కాలనీవాసులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా కాలనీలలో నడుములోతు వర్షంనీరు చేరడంతో పరిస్థితి దయనీయంగా తయారైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టేవిషయంలో అధికారులు అలసత్వం వహించడం వల్లే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం పూర్తి అయిన వెంటనే ట్రంక్ లైన్ నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉండగా వర్షాకాలం సమీపిస్తున్న సమయంలో నిర్మాణం పనులు చేపట్టడంతో పనులు పూర్తికాని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పనులు పూర్తికాకపోగా ప్రతి ఏడాది బడ్జెట్ కూడా పెరుగుతుంది. ప్రజలకు జరుగుతున్న ఇబ్బందులను పరిష్కరించే విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడం వల్లే తాము ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజలు అనారోగ్యం పాలవుతున్న స్పందించరా : కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త : కొత్తపేట డివిజన్ మారుతినగర్ రోడ్ నెంబర్ 13/ఏలో డ్రైనేజ్ మురుకునీరు మంచినీటిలో కలుస్తున్నాయని స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్‌దృష్టికి తీసుకువెళ్లగా ఆ ప్రాంతాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి త్రాగునీటిలో మురుగునీరు కలిసి ప్రజలు అనారోగ్యం బారిన పడి ఇబ్బంది పడుతున్న ఎందుకు పట్టించుకోవడంలేదని వెంటనే పైపులైన్‌ను మార్చాలన్నారు. డివిజన్లో డ్రైనేజీ లైన్లు పాతగా అయిపోవడం వల్ల ఇలాంటి సమస్యలు బయటపడుతున్నాయని వాటి వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందర్‌నారాయణ, మంచి రాజేష్, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : సిపి డిఎస్.చౌహాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న సిపి డి.ఎస్.చౌహాన్

నేరెడ్‌మెట్, జూలై 21 ప్రభాతవార్త : నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను దృష్టిలో వాటి నివారణ కోసం, అదే విధంగా మొహర్రం పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేందుకు తీసుకునే చర్యలపై శుక్రవారం రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో డీసిపి, ఏసిపి, ఇతర ఉన్నతాధికారులతో కలసి వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా రాచకొండ పరిధిలో ఇబ్బందులు ఎదుర్కుంటున్న ప్రజల కోసం సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఏర్పడకుండా ట్రాఫిక్ సిబ్బంది చూడాలన్నారు. మ్యాన్ హోల్స్, ప్రమాదకరమైన చోట్ల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతేనే రోడ్లపైకి రావాలన్నారు. మొహర్రం పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఎటువంటిఅవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమీషనర్ సత్యనారాయణ, డీసిపి బాలస్వామి, జానకి, ఎస్బీ ఓఎస్డీ మహేష్, ఏసిపి జావెద్, ఏసిపి జగదీష్‌చందర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేస్తున్న సిఎం కెసిఆర్ : సామ రంగారెడ్డి



రోడ్డుపై ధర్నా చేస్తున్న సామ రంగారెడ్డి

ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త : గడిచిన 9 సంవత్సరాలుగా డబుల్ బెడ్‌రూమ్ పేరుతో పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇస్తామని చెప్పి ఆశ చూపిస్తూ ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున కేసీఆర్ విధానాన్ని నిరసిస్తూ చైతన్యపురి జాతీయ రహదారిపై బిజెపినాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా 20లక్షల డబుల్ బెడ్ రూమ్ అవసరమని, ప్రతిపేదవారికి డబుల్ బెడ్‌రూమ్ కడుతున్నామని చెప్పిన కెసిఆర్ కేవలం 90 వేలు మాత్రమే నిర్మించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్‌లను తాము పరిశీలిస్తే సిఎం బండారం బయట పడుతుందని, కిషన్ రెడ్డిని అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలను ప్రజాప్రతినిధులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు.

## సమాజానికి తమ వంతు సేవలు : చంద్రశేఖర్



ఖాతాదారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్, శ్రీనివాస్

మలక్‌పేట, జూలై 21 ప్రభాతవార్త : నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మలక్‌పేటలోని తిరుమల బ్యాంకు ఛైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు గొడుగుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్ఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ శ్రీనివాస్ విచ్చేసి చంద్రశేఖర్‌తో కలిసి గొడుగులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలదించడంలో తిరుమల బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కరోనా సమయంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను అభినందించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ వినియోగదారులకు, సమాజానికి తమ వంతు సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ కిషోర్, సిఇఒ రాజారావు, మేనేజర్ రవిశంకర్, సిబ్బంది టిఎస్ఆర్ మూర్తి, శోభనాద్రి, సుజాత, లక్ష్మి, బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## 23న మహేశ్వరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయం ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న నియోజకవర్గ టిడిపి నాయకుడు ఎడ్ల మల్లేష్‌ముదిరాజ్

సరూర్‌నగర్, జూలై 21 ప్రభాతవార్త: మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మహేశ్వరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం ఈ నెల 23వ తేదీన జరుగుతుందని నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు, కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే క్రమంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఆదివారం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిటిడిపి అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర పార్టీ ఇంఛార్జి కంభంపాటి రామ్మోహన్‌రావులు విచ్చేసి వారి చేతుల మీదుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మంద మల్లమ్మ చౌరస్తా నుండి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీని నిర్వహించి అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో చేవెళ్ళ పార్లమెంటరీ టిడిపి బిసిసెల్ అధ్యక్షుడు బండారి కొమురేష్, ముత్యాల వాసు సాగర్, మహేశ్వరం, కందుకూరు మండలాలు, ఆర్‌కెపురం డివిజన్ పార్టీ అధ్యక్షులు నరేష్, బాల రాజు, నర్సింగ్, నాయకులు శ్రీశైలం, మల్లేష్, రాము నాయక్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా చర్యలు : జలమండలి జిఎం ఖాదర్‌మొహినుద్దీన్

మలక్‌పేట, జూలై 21 ప్రభాతవార్త : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై వర్షపు నీరు, డ్రైనేజీ నీరు నిలువకుండా తగిన చర్యలు చేపడుతున్నామని జలమండి డివిజన్ 2 (ఎ) జిఎం ఖాదర్‌మొహినుద్దీన్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని తన కార్యాలయంలో జలమండలి అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలు, ఓవర్ ఫ్లో నీరు నిలిచిపోయిన వెంటనే చర్యలు చేపట్టాలని, అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీస్, జిహెచ్ఎంసి విభాగాలతో సమన్వయం చేసుకోవాలని, కలుషిత నీరు వచ్చే ప్రాంతాలలో చర్యలు తీసుకోవాలని కోరారు. వాటర్ లాగింగ్ ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, శ్రవణ్‌కుమార్, నాగరాజు, కలీముద్దీన్, మినాజుద్దీన్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రం చేసిన కాలనీవాసులు

ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త : పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, విజయపురికాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పున్న గణేష్ నేత, కార్యవర్గ సభ్యుడు గట్ల రవీంద్ర కోరారు. భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సరూర్‌నగర్ డివిజన్ విజయపురికాలనీలో కాలనీ సంక్షేమ సంఘంప్రతినిధులు శుక్రవారం కాలనీలోని చెత్తాచెదారాన్ని తొలగించి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఎటువంటి సమస్య తలెత్తవద్దని కాలనీ ప్రతినిధులు ఎప్పటికప్పుడు వాకబు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు బండి మధుసూదన్‌రావు, పి.ఆనంద్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సంపత్, అనుదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో బిజెపిదే అధికారం: హరిగౌడ్

సైదాబాద్, జూలై 21 ప్రభాతవార్త: తెలంగాణాలో కిషన్‌రెడ్డి నేతృత్వంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా అమరవీరుల స్థూపం నుంచి బిజెపి రాష్ట్ర కార్యాలయంవరకు నిర్వహించిన పాదయాత్ర ర్యాలీలో హరిగౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో అధికార బిఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

## కిషన్‌రెడ్డికి అందెల శ్రీరాములు అభినందన

సరూర్‌నగర్, జూలై 21 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అభినందించారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం నుండి పలువురు నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్ళిన అందెల అక్కడ ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిషన్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో బిజెపి వచ్చే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేస్తుందన్నారు.

## తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్

తుర్కయంజాల్, జూలై 21 ప్రభాతవార్త : తుర్కయాంజల్ మున్సిపాలిటీ. కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ శుక్రవారం భాద్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్ టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్,మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు,తో కలిసి ఘనంగా సన్మానం చేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేముల స్వాతిఅమరేందర్ రెడ్డి, మేతరి అనురాధదర్శన్, పుల్లగుర్రం కీర్తనవిజయానందరెడ్డి, గుండా భాగ్యమ్మ ధనరాజ్, నారని కవితశేఖర్‌గౌడ్, బొక్క రవీందర్‌రెడ్డి, కోండ్రు మల్లేష్, కో ఆప్షన్ మెంబర్ నరసింహారెడ్డి, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, తాళ్లపల్లి మోహన్‌గుప్తా, బొక్క గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి కార్పొరేటర్ల సత్కారం

ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త : బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని రాష్ట్ర బిజెపి కార్యాలయం ఆర్కేపురం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, నాయకోటి పవన్ కుమార్‌లు కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిని వారు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిషన్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికార పగ్గాలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



వరద బాధితులకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సైదాబాద్, జూలై 21 ప్రభాతవార్త: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ అల్తాఫ్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలిసి ఆయన పర్యటించి వరదముంపు పరిస్థితిని స్వయంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్తాఫ్‌నగర్‌లో వరదముంపు గురైన వారికి తగిన సహాయ సహకారాలు అందించాలని శ్రీనివాసరావు, వరప్రసాద్‌రెడ్డికి సూచించామని వారు రాత్రినుంచి ఇక్కడే అందుబాటులో ఉండడం జరిగిందన్నారు. ఇంట్లోకి నీరువచ్చిన వారిని పక్కనే కమ్యూనిటీహాల్‌లోకి తరలించి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వరదనీరు సాఫీగా వెళ్లేలా పాఠశాల గోడను కొంత మేర తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోటేశ్వర్‌రావు, కనకయ్య, డివిజన్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు తిలక్‌రావు, రాకేష్ ఠాగూర్, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బొంబాయి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఉపేందర్‌రెడ్డి



ఆస్పత్రిలో షరీఫ్‌తో చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జూలై 21 ప్రభాతవార్త : నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అహ్మద్ షరీఫ్‌కి తల్లిదండ్రులు లేని నిరుపేద యువకుడు ప్రమాదవశాత్తు ఇంటి పై అంతస్తునుండి జారీ కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న ఉపేందర్ రెడ్డి మానవతాదృక్పథంతో ఆలోచించి వెంటనే స్పందించి రుచిత చారిటబుల్ ట్రస్ట్‌ఛైర్మన్ తోడుపునూరి సతీష్, ప్రాణహిత ఆస్పత్రి అధినేత డాక్టర్ రాహుల్ రెడ్డి, అనిల్ సంయుక్త అధ్వర్యంలో షరీఫ్‌కి ఆపరేషన్ చేసి వైద్యాన్ని అందించారు. రుచిత ట్రస్ట్, ప్రాణహిత ఆసుపత్రి బృందానికి షరీఫ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్బర్, కళ్యాణ్, విజయ్, అనుదీప్, విప్లవ్, నగేష్, అనీల్, ఆసుపత్రి మేనేజర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన నందికంటి



బండచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నందికంటి శ్రీధర్..

నేరెడ్‌మెట్, జూలై 21 ప్రభాతవార్త: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని బండచెరువులోకి ఎగువ ప్రాంతాలనుండి నీరు వస్తుండడంతో చెరువు పొంగి ఇళ్ళలోకి వస్తుందన్నారు. శుక్రవారం ఆయన బండచెరువు, ఈస్ట్ ఆనంద్‌బాగ్, షిరిడినగర్, ఉప్పరిగూడ ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలసి ఆయన పర్యటించారు. కాలనీల్లోకి నీరు వస్తుండడంతో ప్రజలు నిద్రలు లేని రాత్రులు గడుపుతున్నారన్నారని అన్నారు. కాలనీలు నీట మునగకుండా కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికి ఆ సమస్యను తీర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమేష్ సింగ్, శ్రీనివాస్, సూర్యప్రకాష్, శ్యామ్‌రావు, ప్రవీణ్, సతీష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలి



రాక్‌గార్డెన్ పార్కును ప్రారంభిస్తున్న ఎండి నర్సింహ్మారెడ్డి, ఛైర్మన్ బాలమల్లు

నాచారం, జులై 21 ప్రభాతవార్త: పారిశ్రామికవాడల్లో పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాలని టిఎస్ఐఐసీ ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు, టిఎస్ఐఐసీ ఎండి ఇ.వి.నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం పారిశ్రామిక వాడలో రూ. కోటిన్నర వ్యయంతో ఐలా నాచారం, అరిజెన్ లైఫ్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో అరిజెన్ ఆర్థిక సహాయంతో రాక్‌గార్డెన్ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని అరెజిన్ సంస్థ డైరెక్టర్ అండ్ సిఈవో మన్ని కంటిపూడి, వైస్ ఛైర్మన్ తల్లాడ వెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రజలు, ఇండ్రస్ట్రీస్ ఉద్యోగులు, కార్మికుల కోసం అరిజెన్ సంస్థ పార్కును అభివృద్ధి చేయడం సంతోషకరమన్నారు. పార్కును ప్రజలందరు వినియోగించుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు అరిజెన్ సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ఎంఐఏఎస్ఎ ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి వి.బాల్‌రాజ్, ఎస్.వెంకటేశ్వర్‌రావు, సర్ధార్‌ఖాన్, టిఎస్ఐఐసీ ప్రాజెక్ట్స్ సిఈవో వి.మధుసూధన్, చీఫ్ ఇంజనీర్ కె.శ్యాసుందర్, మల్లాపూర్ ఐలా జోనల్ మేనేజర్ మాధవి, కమీషనర్ ఉమామహేశ్వర్, డి.ఇ. అంజయ్యతో పాటు పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

## జలమయమైన కాలనీలలో సహాయక చర్యలు



జలమయమైన కాలనీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

మల్కాజిగిరి, జూలై 21 ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలో వర్షానికి జలమయమైన కాలనీలు ఎన్ఎండిసి కాలని షిరిడినగర్, సత్తిరెడ్డి కాలనీ ఏరియాలలో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు సహకారంతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, ఉమాపతి, బ్రహ్మయ్య, కాలనీవాసులు ప్రభాకర్‌గౌడ్, యాదగిరి, నర్సింహారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం ప్రకటించిన నిధుల నుండి నిధులు ఇవ్వాలని మంత్రికి బిజెపి కార్పొరేటర్ల వినతి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి కార్పొరేటర్లు

సరూర్‌నగర్, జూలై 21 ప్రభాతవార్త: తెలంగాణ అవతరణ దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు సిఎం కెసిఆర్ కేటాయించిన నిధుల నుండి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లకు నిధులను కేటాయించాలని బిజెపికి చెందిన పలువురు కార్పొరేటర్లు రాష్ట్ర మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్‌ల ఆధ్వర్యంలో బిజెపి కార్పొరేటర్ల బృందం మంత్రి నివాసానికి వెళ్ళి ఆమెను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని తుమ్మలూరులో జరిగిన హరితహారానికి వచ్చిన సిఎం కెసిఆర్ నియోజకవర్గానికి నిధులు కేటాయింపు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సిఎం కెసిఆర్ కేటాయించిన రూ.50 కోట్ల నిధుల నుండి అదే విధంగా హెచ్ఎండిఎ నిధుల నుండి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పది డివిజన్లలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించాలని వారు మంత్రి సబితారెడ్డిని కోరారు. **సిసి రోడ్డు, బాక్స్ డ్రెయిన్ కోసం శ్రీధర్‌రెడ్డి వినతి...** కాగా నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్ఆర్ కాలనీ నుండి కమ్మగూడ వరకు రోడ్డు, గ్రీన్ హోమ్స్ కాలనీ నుండి కమ్మగూడ మీదుగా వెళ్లే కాలువకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణాల కోసం నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి ప్రత్యేకంగా మంత్రికి మరో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, బంగారు అనితారాణి ప్రభాకర్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డిలు పాల్గొన్నారు.

## ఈనెల 23న ఉప్పల్ నల్ల పోచమ్మ బోనాలు



ఉత్సవాలకు ముస్తాబైన దేవాలయం ఇన్‌సెట్‌లో కొలువుదీరిన అమ్మవారు

ఉప్పల్, జూలై 21 ప్రభాతవార్త : ఉప్పల్‌లో బోనాల ఉత్సవాలకు పలు ప్రాంతాలు ఆలయాలు సర్వంగా సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఉప్పల్‌లో వైభవంగా జరిగే ఉప్పల్ నల్ల పోచమ్మ బోనాల ఉత్సవాలు ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి నేతలు మేకల శివారెడ్డి, సల్ల వీరారెడ్డి, సల్ల రాజిరెడ్డి, బిక్కుమల్ల అంజయ్య, దుబ్బ నరసింహారెడ్డి, పోగుల దయాకర్ రెడ్డి, గుమిడెల్లి నారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ నల్ల పోచమ్మ ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. అదేవిధంగా ఈనెల 23వ తేదిన చిలుకానగర్ మైసమ్మ దేవాలయం, ఆదర్శనగర్,కుమ్మరికుంటలోని పోచమ్మ, శ్రీపెద్దమ్మ దేవాలయాలలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఉప్పల్ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఈ నెల 27వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలసందర్భంగా పలువురు ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వద్ద రోడ్లు, వీధిదీపాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులతో కలిసి సమీక్షిస్తున్నారు. వర్షాకాలంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటి నేతలు తెలిపారు. భక్తులు ఆనందోత్సవాలతో ఉత్సవాలు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరదనీరు వెళ్లడానికి కాలువను తీయిస్తున్న కార్పొరేటర్

హయత్‌నగర్, జులై 21 ప్రభాతవార్త: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని... జీహెచ్ఎంసీ మాన్‌సూన్ టీం సహకారంతో వరదనీటి సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరిస్తున్నామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని ముంపు ప్రాంతాలు, వరదనీరు నిలిచిన కాలనీలను సందర్శించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. శారదానగర్‌లో రోడ్లపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదు మేరకు మాన్‌సూన్ టీం సహకారంతో జేసీబీతో వరదనీటికి అడ్డుగా ఉన్న ప్రహారీ గోడకు రంధ్రం పెట్టించి నీరు రోడ్డుపైన నిలువకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీలలో డిప్యూటీ కమిషనర్ రవీందర్‌కుమార్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఆయా కాలనీల్లో వరదనీరు రోడ్లపై నిలుస్తుండడాన్ని పరిశీలించారు. వరదనీరు నిలువకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ డిప్యూటీ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పాండా శ్రీధర్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మంత్రి కెటిఆర్ రాజీనామా చేయాలి : మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ

సైదాబాద్, జూలై 21 ప్రభాతవార్త: కేంద్ర మంతి కిషన్‌రెడ్డి బాటసింగారంలోని డబుల్‌బెడ్ రూం ఇండ్ల సందర్శనకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం హైద్రాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలోని బిజెపి నాయకులను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ అన్నారు. పేదలందరికి డబుల్‌బెడ్ రూం ఇండ్లు కట్టిస్తామని ప్రగల్భాలు పలికిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎక్కడా కూడా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. పనులు మొదలుపెట్టిన కొద్ది పాటి ఇండ్లు కూడా అసంపూర్తిగా ఉన్నాయని, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారే తలుపులు,కిటికీలు, విద్యుత్ సామాగ్రిని తొలగించివేశారని ఆయన విమర్శించారు. దీనికి మంత్రి కెటిఆర్ బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డిప్యూటీ మేయర్‌గా ఉన్నప్పుడు సింగరేణి కాలనీలో 2 వేల ఇండ్ల నిర్మాణం చేయడం జరిగిందని, ఇది బిజెపి ఘనతేనని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇచ్చినప్పటికీ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు.

## కార్పొరేటర్ బిక్షపతిచారికి మాతృ వియోగం

సరూర్‌నగర్, జూలై 21 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 27వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి మాతృమూర్తి పసునూరి కమలమ్మ అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్‌గౌడ్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, పార్టీ ప్రధాన కార్యదర్శులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, కార్పొరేటర్ భీమ్‌రాజ్, మల్లికార్జున్‌లతో పాటు పలువురు కమలమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి బిక్షపతిచారిని పరామర్శించారు.